జూడో సంఘం రాష్ట్ర ప్యాట్రన్‌గా అప్పాజీ

ప్రజాశక్తి-అమలాపురం

జూడో సంఘం రాష్ట్ర ప్యాట్రన్‌గా సీనియర్ పాత్రికేయుడు చొల్లంగి అప్పాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎపి జూడో అసోసియేషన్ చైర్మన్ అడవరం నాగూరయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర జూడో సంఘ వార్షిక సర్వసభ్య సమావేశం విజయవాడలో నిర్వహించినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో జూడో క్రీడ కార్యాలయాలు స్థాపించడం తద్వారా గ్రామాల్లోని ఆడపిల్లలకు ఆత్మరక్షణగా జూడో క్రీడ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామని అప్పాజీ తెలిపారు. రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో బాలికలకు పతకాలు సాధించే దిశగా అత్యుత్తమ క్రీడా శిక్షణ ఇచ్చి తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పోటీకి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

వేట లేక.. పూట గడవక..

- మత్స్యకారులకు అందని పరిహారం
- నెల రోజులుగా అవస్థలు
- ప్రతి ఏటా ఇదే తంతు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వేట సాగక పూట గడవక మత్స్యకారులు ఆకలితో అలమటించే పరిస్థితులు నెలకొన్నాయి. వేట నిషేధ సమయంలో ఏటా వీరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సముద్రంలోకి వేటకు వెళితేనే నోట్లోకి ముద్ద వెళుతుందని, ప్రస్తుతం కుటుంబ పోషణ కష్టంగా మారిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. అరకొర మందికి ఇచ్చే పరిహారంలోనూ ఆలస్యం చేస్తుండడం వల్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు దాటుతున్నా పరిహారం పంపిణీ చేయని సర్కారు తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇచ్చే విషయంలో ప్రభుత్వం పరిహాసమాడుతోందంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ 60 రోజులు వరకూ జిల్లాలో వేట నిషేధం అమల్లో ఉంది. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి తదితర 13 మండలాల్లో 144 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. కోస్తా తీర ప్రాంతం గుండా 3.55 లక్షల మంది నివసిస్తుండగా చేపల వేట ద్వారా సుమారు 70 వేల కుటుంబాలు ఉపాధిని పొందుతున్నాయి. సుమారు 600 మెకనైజ్డ్, 3 వేల పైబడి మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు చేపల వేటన సాగిస్తున్నారు. చేపలు గుడ్లు పెట్టే దశలో మర, మోటారు బోట్లతో వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఏటా దేశవ్యాప్తంగా 60 రోజుల పాటు వేట నిషేధం అమల్లో ఉంటుంది. వీరిలో సుమారు 25 వేల కుటుంబాలకు మాత్రమే ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి గతేడాది మాదిరిగానే రూ.10 వేల పరిహారం వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రూ.25 కోట్లు బడ్జెట్ కేటాయించినట్టు అధికారులు తెలిపారు.

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ తీరంలో నిలిచిన బోట్లు

ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నాం

సముద్రంలో చేపల వేట ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నెల రోజులుగా వేట సాగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వేరే పని తెలియదు. ప్రభుత్వం మాకు ఇచ్చే పరిహారం విషయంలో నిర్లక్ష్యాన్ని వదలి సక్రమంగా పంపిణీ చేయాలి.

- బెనుక ప్రసాద్, మత్స్యకారుడు, కోనపాపపేట, యు.కొత్తపల్లి మండలం.

పరిహారం త్వరితగతిన ఇవ్వాలి

వేట నిషేధ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేదు. వేరే పని మాకు చేత కాదు. నెల రోజులు దాటుతున్నా ఇంకా పరిహారం అందలేదు. ఎప్పటికి అందుతుందో తెలియదని అధికారులు అంటున్నారు.

- చోడిపల్లి ఏసు, మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం.

ఏటా ఆలస్యమే

వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారం విషయంలో సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడిచిన తర్వాత కూడా పరిహారం ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పుడు నెల రోజులు దాటినా ఒక్క రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఈ పరిహారం ఎప్పటికి ఇస్తారో అధికారులే చెప్పలేకపోవడం గమనార్హం.

మరోవైపు పదేళ్ళుగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ఆయిల్, పప్పులు, బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మోడీ ప్రభుత్వం పెరుగుతున్న ధరలను నియంత్రించడం విఫలమవుతోంది. ఎపిపై ధరల ప్రభావం ఎక్కువగా ఉంది.చంద్రబాబు హయాంలో రూ.4 వేలు ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాకా దాన్ని రూ.10 వేలకు పెంచారు. లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు కఠినతరం చేశారు. గడచిన ఐదేళ్లలో కూడా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడిస్తున్న పరిహారం కూడా సరిపోని పరిస్థితి నెలకొంది.

ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు

మత్స్యసంపదపై ఆధారపడి బతుకున్న వేలాది మంది ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేపల వేట తప్ప వేరే పని చేయలేని వీరు వేట నిషేధ సమయంలో భారంగా కాలాన్ని వెళ్లదీస్తున్నారు. కొంత మంది మత్స్యకారులు వలస బాట పడుతున్నారు. మరికొందరు కూలీ పనులకు వెళుతూ పొట్ట నింపుకుంటున్నారు. ఇంకొందరు ఇంజన్లు మరమ్మతులు, వలల అల్లికలు వంటి పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నారు. చేపలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న మత్స్యకార మహిళలు సైతం వేట నిషేధం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి కేవలం రూ.10 వేలు ఇస్తున్నా అది కూడా సకాలంలో సక్రమంగా అందని పరిస్థితుల నడుమ మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పరిహారం జమ

ఈ ఏడాది సుమారు 25 వేల మందికి పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఎన్నికల కోడ్ వల్ల ఈసారి ఎన్యూమరేషన్‌లో కొంత ఆలస్యం అయ్యింది. ఈ నెలాఖరుకల్లా మత్స్యకారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. గతేడాది మే 5న జమ అయ్యాయి.

- కె.కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, కాకినాడ.

పెట్రోల్ లూజు విక్రయాలు, క్రాకర్స్ నిషేధం

ప్రజాశక్తి-అమలాపురం

పోలింగ్ అనంతరం పలుచోట్ల చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో జిల్లాలో లూజ్ పెట్రోల్ అమ్మకాలు, మందు గుండు సామాగ్రి క్రాకర్స్ తయారీ అమ్మకాలపై ఎన్నికల కౌంటింగ్ వరకూ నిషేధాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో క్రాకర్స్ వ్యాపారులు, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులతో ఆమె బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా యంత్రాంగానికి ప్రజా శ్రేయస్సు, రక్షణ దృష్ట్యా పరస్పర సహకారం అందించాలని సూచించారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా కోనసీమ జిల్లావ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 15 రోజులు పాటు క్రాకర్స్ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజా శ్రేయస్సు దష్ట్యా వాయిదా వేసుకుని పరస్పర సహకారం అందించాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా అడ్మిన్ ఎస్‌పి ఎస్ ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రస్తుతం గోదాముల్లో నిల్వ ఉన్న క్రాకర్స్‌ను నమోదు చేసి సీలు వేయించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీపావళి బాణాసంచా విక్రయాల్లో ప్రభుత్వం క్రాకర్స్‌కు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తోందని ప్రస్తుత హింసాత్మక సంఘటనల నేపథ్యంలో అధికారులకు క్రాకర్స్ పూర్తిగా శాంతియుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు పూర్తిగా తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ 15 రోజులలో క్రాకర్స్ మూలంగా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో దానికి సంబదించిన పరిశోధనలో క్రాకర్ అమ్మినట్లు రుజువైన ట్లయితే పలు కేసుల్లో ఇరుక్కునే ప్రమాదం ఉందని పర్మిషన్ రద్దు చేయడం గోదాములు సీజ్ చేయడం వంటి చర్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. అగ్నిమాపక విపత్తుల స్పందన అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. పలువురు వర్తకులు తమ మందు గుండు సామాగ్రి విక్రయాలను జూన్ 10 వరకు వాయిదా వేసుకుంటున్నట్లు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిఎస్‌పిలు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నూపూర్ అజయ్

అనారోగ్య బాధితునికి టిడిపి సాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

ఈర్ల చెరువు గ్రామానికి చెందిన ముషిణి వెంకటేశ్వరరావు తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండగా టిడిపి అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మధుర్ ఆధ్వర్యాన నాయకులు బుధవారం పరామర్శించి, వారి కుటుంబానికి రూ.50 వేల సాయం అందించారు. టిడిపి మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, వర్ధినేని బాబ్జి, బోనం బాబు, ఈలి శ్రీనివాస్, కడలి నూకరాజు, కంచి విశ్వనాథం, నైనాల అబ్బాస్, అప్పారి వెంకటేశ్వరరావు, ఉండ్రు శ్రీరామరావు, సాపే ఏకాదశి, నైనాల రాజు, వాసంశెట్టి వెంకట్రావు, ఇంటి గణపతి, పరసా సుజాత, పోసింశెట్టి విస్సు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందిసున్న నాయకులు

జీవ వైవిధ్య వారోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

జీవవైవిధ్య దినోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన బుధవారం అమలాపురంలోని ఎంప్లాయిస్ హోమ్‌లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాలు ప్రారంభించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభరించిన ఈ వారోత్సవాల్లో అమలాపురం శాఖ గౌరవాధ్యక్షుడు డి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ డార్విన్ అనేక అవస్థలు పడి జీవపరిణామ సిద్ధాంతాన్ని మనకు అందిస్తే దాన్ని మన ప్రభుత్వాలు విద్యార్థుల సిలబస్ నుండి తొలగించాయన్నారు. డార్విన్ సిద్ధాంతం ప్రకారం అన్ని జీవులు మనగలగాలి అన్నారు. రాష్ట్ర పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్ కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి మే 22ను అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం జరపమని పిలుపునిచ్చింన్నారు. ప్రతి జీవి వైవిధ్యంతో పరస్పర సహకారంతో జీవించడమే జీవవైవిధ్యం అన్నారు. జీవ వైవిధ్యంతోనే మనకు తాగునీరు, ఆహారం, ఆరోగ్యం, ఔషధాలు అందుతున్నాయన్నారు. మొక్కలు, జంతువులు పరస్పర సహకారంతో జీవిస్తున్నాయని, అందువల్ల జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలు వారం పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, వివిఆర్‌కె.అర్జునరావు, పి.భాస్కర రావు, అబ్బిరెడ్డి రామకృష్ణ, జిల్లా కోశాధికారి త్రినాథ్ కుమార్, జిల్లా చెకుముకి కన్వీనర్ ఎన్.అబ్బులు, జిల్లా ఆడిట్ కన్వీనర్ బిఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పొలమ్మ చెరువు బుద్ధ పార్కు అవరణలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా పి.ఉదయ భాస్కర వర్మ ఆధ్వర్యాన ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసిన పాలెపు ధర్మారావు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా విజ్ఞాన సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే కాక కంప్యూటర్ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సైన్స్ అండ్ టెక్నాలజీని పరుగులు పెట్టించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, అయితాబత్తుల పండుబాబు, దివి వెంకన్నబాబు, చెల్లూరి బాలకృష్ణ, గిడ్డి రాజు, కముజు రాంబాబు పాల్గొన్నారు.

26 నుంచి మహాలక్ష్మి అమ్మవారి జాతర

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నం లంక గ్రామ దేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహక కమిటీ బుధవారం తెలిపింది. 26 ఆదివారం రాత్రి గరగ నృత్యాలు వివిధ సాంసతిక కార్యక్రమాలతో జాతర మహోత్సవం జరుగుతుందన్నారు. సోమవారం అమ్మవారి నైవైద్యాలు సమర్పిస్తారన్నారు. మంగళవారం సిరి బొమ్మ తీర్థం జరుగుతుందన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ జనరల్ ఒకేషనల్ సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జనరల్ కేటగిరీలో 7,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఒకేషనల్‌కు సంబంధించి 1,015 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. 8,748 మంది విద్యార్థులకు జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధికారులు సమన్వయంతో విజయవంతంగా పరీక్షలు నిర్వహించి సఫలీకతం చేయాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం బెటర్మెంట్ పరీక్షలు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష తప్పిన విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5:30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జూన్ ఒకటో తేదీన లాంగ్వేజ్ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.సోమశేఖర్ రావు మాట్లాడుతూ ట్రాన్స్‌కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అంతరాయాలు ఏర్పడిన పక్షంలో విద్యార్థులు పూర్తిగా పరీక్షపై దృష్టి సారించలేక అసౌకర్యానికి గురవుతారని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు పూర్తి సమన్వయంతో పరీక్షలను సజావుగా నిర్వహించాలని ఆయన సూచించారు. రవాణా శాఖ అధికారులు పరీక్షా తేదీల్లో పరీక్షా కేంద్రానికి హాజరయ్యే సమయంలో బస్సు రద్దీగా ఉన్నప్పటికీ తప్పనిసరిగా విద్యార్థిని విద్యార్థులను బస్సు ఎక్కించుకుని పరీక్షా కేంద్రాల గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన కోరారు. పోలీసు అధికారులు ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల తరలింపులో భద్రత కల్పించాలని కోరారు. చీఫ్ సూపరింటెండెంట్లు, సిబ్బంది విద్యార్థులను పరీక్షలు బాగా రాసే విధంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇన్విజిలేటర్లుగా ఉపాధ్యాయులను నియమించడానికి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎం.కమల కుమారి, డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావు దొర, పోలీస్ ఉన్నతాధికారులు, కమిటీ సభ్యులు మంగారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు

కృష్ణబాబు మృతికి ఎంఎల్‌సి కుడిపూడి సంతాపం

ప్రజాశక్తి-అమలాపురం

కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ, వైసిపి నేత పెండ్యాల కృష్ణబాబు మృతి పట్ల ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కొవ్వూరు ఎంఎల్ఎగా ఆయన నాలుగుసార్లు పోటీ చేశారని తెలిపారు. దానధర్మాలు చేసి మంచి పేరు సంపాదించారని సూర్యనారాయణ అన్నారు. ఈ సమావేశంలో వైసిపి కోనసీమ బిసి సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, కుడిపూడి త్రినాథ్, గుత్తుల ధర్మారావు, ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్, కుడిపూడి వెంకటేష్, చిట్టూరి పెదబాబు, గుత్తుల రాంబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పలుచోట్ల పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్, ఐ.పోలవరం, రామచంద్రపురం, ఉప్పలగుప్తం

అమలాపురం రూరల్‌లోని నల్లమిల్లి రాజీవ్ గృహకల్ప సముదాయంలో పోలీసులు బుధవారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ శేఖర్ బాబు అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. సరైన పత్రాలు లేని 10 బైకులను సీజ్ చేశారు. ఎలక్షన్ కౌంటింగ్‌కు సంబంధించి ప్రజలు ఎవరూ కూడా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయకూడదని, ఎటువంటి గొడవలకు వెళ్ళకూడదని ఎస్ఐ శేఖర్ బాబు హెచ్చరించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా దానికి సంబంధించిన వారి మీద కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముమ్మిడివరం సి.ఐ ఎన్.కొండయ్య, ఐ.పోలవరం ఎస్.ఐ జె.భాను ప్రసాద్ బృందంతో ఐ.పోలవరం మండలం భైరవపాలెం, జి.మూలపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సరిగా లేని 50 బైకులు, రెండు ఆటోలను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. భైరవపాలెం గ్రామంలో ఒక షాప్‌లో 450 లీటర్ల డీజిల్ ఆయిల్ అక్రమంగా అమ్ముతుండగా ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున సభలు సమావేశాలు ఏర్పాటు చేయకూడదని, నలుగురు కంటే ఎక్కవ మంది గుమిగూడడం చేయరాదన్నారు.

రామచంద్రపురం పట్టణంలోని రాజబాబు నగర్‌లో పోలీసులు బుధవారం విస్తత తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్తగా డిఎస్‌పి బి.రామకృష్ణ ఆదేశాల మేరకు రామచంద్రపురం ఎస్ఐ సురేష్ బాబు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇటీవల ఎవరైనా కొత్తగా ఇక్కడికి వచ్చిన వారు వివరాలు పోలీసులకు తెలపాలని సూచించారు.

ఉప్పలగుప్తంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

ఉప్పలగుప్తం చల్లపల్లి పంచాయతీ తీర గ్రామమైన వాసాలతిప్పలో అమలాపురం డిఎస్‌పి ఎం.మహేశ్వరరావు పర్యవేక్షణలో సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కెఎం.జోషి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ లో పత్రాలు సక్రమంగా లేని 14 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎఎస్ఐలు వై.సత్యనారాయణ, శ్రీనుబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రైతుల వద్ద రబీ ధాన్యం కొనుగోళు ముగించుకుని ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసుబాబు అధికారులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆలమూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రైతాంగాన్ని ఖరీఫ్ పంట సాగుకు సంసిద్ధత కోసం ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావుతో కలసి బుధవారం ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు ఇప్పటినుంచే ఆర్‌బికెల్లో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు లేవని రైతుల నుంచి మాట రాకూడదని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అవసరమైన ఎరువులను ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో స్టాక్ ఉంచాలన్నారు. ఏడిఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు విత్తనాలను సుడోమోనోస్లోరిషన్స్‌తోను లేదా భావిస్టన్‌తోగాని తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటి మీద రైతులందరికీ అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విఎఎలను ఆదేశించారు. వారి అనుమానాలను నివృత్తి చేసి సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఆఫీస్ టెక్నికల్ ఎంఒ మురళి, మండల వ్యవసాయ అధికారులు ఎస్.లక్ష్మీ లావణ్య, కెవిఎన్.రమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు

సామర్లకోటలో సమస్యల తిష్ట

- తప్పని తాగునీటి కష్టాలు
- అధ్వానపు రహదారులు, డ్రెయిన్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రధాన సమస్యలను పాలకవర్గాలు, అధికారులు పట్టించుకోవడం లేదు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ స్థానికంగా టిడిపి నుంచి ఎంఎల్ఎగా నిమ్మకాయల చినరాజప్ప గెలిచారు. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులు పడకేశాయి. వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా దవులూరి దొరబాబును నియమించినప్పటికీ అభివృద్ధి పనులపై దృష్టి సారించలేదనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఇద్దరు మినహా 29 మంది వైసిపి కౌన్సిలర్ గెలుపొందినప్పటికీ ఫలితం లేకుండా పోయిందనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇక మున్సిపల్ అధికారులు తీరు 'గంతకు తగ్గ బొంత' అన్నట్లుగా ఉంది. ఆఖరికి తాగునీటి సమస్యను పరిష్కరించే పరిస్థితి అధికారులకు లేకుండాపోతుంది.

పట్టణం శిధిలమైన ప్రధాన రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టులతోపాటు, తాగునీటి సమస్య, అపారిశుధ్యంతో కొట్టుమిట్టాడుతోంది. పిఠాపురం - సామర్లకోట, పెద్దాపురం - సామర్లకోట ఆర్ అండ్ బి రహదారులు గుంతలమయమై ప్రయాణీకులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కందకం వద్ద ఏలేరు కొత్త వంతెన వద్ద అప్రోచ్ పాడై గుంతలు పడటంతో వాహన దారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అలాగే పిఠాపురం, పెద్దాపురం ప్రధాన రహదార్లలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు పడటంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాకినాడ, వేట్లపాలెం రోడ్డులోనూ ఆర్ అండ్ బి రహదారులు సైతం గోతులతో నిండుకుని ప్రయాణీకులకు శాపాలుగా మారుతున్నాయి. ఇక డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నెలకుంది. నీలమ్మ చెరువు, అయోధ్య రామపురం, తదితర ప్రాంతాల్లో కల్వర్టులు పూర్తిగా శిధిలమై ప్రమాదాలకు కేంద్రాలుగా మారిపోయాయి. అయోధ్య రామపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద కల్వర్ట్ పూర్తిగా శిధిలం కావడంతో డ్రెయిన్ ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో ప్రజల రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకుంది. పట్టణంలోని 90 శాతం డ్రెయిన్‌లలో పూడికను తొలగించకపోవడంతో ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే రోడ్డు, డ్రెయిన్ అన్నా తేడా లేకుండా మురుగునీటి ప్రవాహం జరుగుతోంది. ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తుండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సిఎం జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన జగనన్న కాలనీలో కనీస మౌలిక సదుపాయాలైన డ్రెయినేజీ వ్యవస్థను చేపట్టకపోవడంతో ఆయా గృహాల నుంచి వ్యర్థ నీటితోపాటు, వర్షపు నీరు బయటకు వెళ్లే దారి లేక రోడ్డు, నివాసాలు మురుగునీటితోనే కన్పిస్తున్నాయి. అలాగే పట్టణ ప్రజలను తాగునీటి సమస్య వెంటాడుతోంది. కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీటితోనూ తిప్పలు తప్పడం లేదు. ఫిల్టర్ ప్లాంట్‌లో లోపాల వల్ల, అవగాహన లేని సిబ్బందితో ఆకుపసరుగా, సుద్ద నీటిగా సరఫరా జరుగుతోంది. దీంతో తాగునీటి కోసం ప్రజలు ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించక తప్పని పరిస్థితి. మున్సిపాలిటీ అందించే మరో ముఖ్యమైన వ్యవస్థ పారిశుధ్య వ్యవస్థ. ఆ వ్యవస్థ సైతం పడకేసింది. ఇంటింటా చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ఆటోలు, ఇతర అత్యాధునిక వాహనాల మరమ్మతుల కారణంగా కార్యాలయ ఆవరణలో అలంకారప్రాయంగా ఉన్నాయి. కొద్దిపాటి వాహనాలు మాత్రమే వార్డుల్లో తిరగడంతో కొంతమేరకు మాత్రమే చెత్తను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో పిన్ పాయింట్ల వద్ద పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పట్టణాన్ని సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దే పాలకుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పెద్దాపురం రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

మూలన పడిన ఈ ఆటోలు

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

బాలుని మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని పారుపాక గ్రామానికి చెందిన పారుపల్లి రాజబాబు భార్య వెంకటలక్ష్మి జిల్లా ఎస్‌పి స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ అబ్దుల్ నబి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పారుపల్లి రాజబాబు వెంకటలక్ష్మి దంపతులకు ఆరేళ్ల బాలుడు పారుపల్లి సాకేత్ ఉన్నాడు. వీరు తుని పట్టణంలో నివాసం ఉంటున్నారు. మార్చి నెలలో బంధువుల వివాహం నిమిత్తం పారుపాక గ్రామానికి రాగా సాకేత్‌కు వరుసకు మేనమామ అయిన అదే గ్రామానికి చెందిన కె.శ్రీను మార్చి 13వ తేదీన పారుపాక గ్రామం నుంచి రౌతులపూడికి తీసుకురాగా రౌతులపూడి నుంచి పారుపాక తిరుగు ప్రయాణంలో రౌతులపూడి గ్రామ శివారు ద్విచక్ర వాహనంకు ప్రమాదం జరగడంతో సాకేత్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలు పాలైన సాకేత్‌ను వైద్యం నిమిత్తం తుని తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యశాల నిమిత్తం కాకినాడ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అదే నెల 16వ తేదీన సాకేత్ మృతి చెందాడు. ఆ సమయంలో ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంతో ఏప్రిల్ నెలలో జిల్లా ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రౌతులపూడి తహశీల్దార్ సిహెచ్.విద్యాపతి, ఎస్ఐ నబి సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

నాడు - నేడు పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు రెండో దశ పనుల్ల అలసత్వానికి తావు లేనివిధంగా శర వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనుల ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాల మేరకు రెండో విడత చివరి దశలో ఉన్న నాడు-నేడు పనుల్లో అలసత్వానికి తావు లేకుండా త్వరితగతిన పాఠశాలలలు పున్నప్రారంభించే నాటికి పనులన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి పాఠశాలలోను తాగునీరు, విద్యుదీకరణ, తరగతి గదులు, మైనర్ మేజర్ పనులు వంటి మౌలిక వసతులను పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారంతో స్టేజ్ కంప్లీషన్ పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు కాంపోనెంట్‌ల వారీగా నాడు-నేడు పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించి పూర్తయిన పనుల బిల్లులను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీలు రావాల్సి ఉందని, పనులు పూర్తి చేయడానికి సిమెంటు, ఇసుక కొరత ఉందని ఎంఇఒలు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం ఎపిసి మధు సూదన్ రావు మండలాల వారీగా సమీక్ష నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమా వేశంలో సమగ్ర శిక్ష సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబ ఎపిఒ డాక్టర్ ఎంఎకె భీమారావు, ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్ కుమార్, ఇఇ సుబ్బరాజు పాల్గొన్నారు.

డాక్టర్ పెద్దింటికి సేవా రత్న పురస్కారం

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ పెద్దింటి రామం సేవా రత్న అవార్డుకు ఎంపికైనట్లు ఆ మేరకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై నుంచి లెటర్ పంపినట్లు రామం తెలిపారు. డాక్టర్ రామం ఇంతవరకు సుమారు 95 అవార్డులు పొందారు. సేవారత్న అవార్డును ఈ నెల 25వ తేదీన చెన్నైలోని భారతీయ విద్య కళా భవన్‌లో అందుకున్నట్లు తెలిపారు.

బాణాసంచా విక్రయాలు నిషిద్ధం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎన్నికల ప్రక్రియలో భాగంగా కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బాణాసంచా అమ్మకాలు, లూజు పెట్రోల్ అమ్మకాలు నిషేధించినట్టు ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో పార్టీలను, వ్యక్తులను ఆధారంగా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బొబ్బర్లంక పిచ్చుకలంక వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ గల్లంతై ఇటీవల పలువురు మృతి చెందిన నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలూ చోటు చేసుకోకుండా బుధవారం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్నానానికి వచ్చే వారిని ఇక్కడ జరిగే ప్రమాదాల గురించి వివరించి నచ్చజెప్పి పంపించేశారు. నలుగురు పోలీసు సిబ్బందితో ప్రతిరోజు ఇక్కడ గోదావరి నదిలో ఎవరూ స్నానానికి దిగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఎసిబికి చిక్కిన పరిశ్రమల శాఖ జిఎం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ పరిశ్రమల శాఖ కాకినాడ జిల్లా జనరల్ మేనేజర్ టి.మురళి బుధవారం రాత్రి ఎసిబి వలలో చిక్కారు. కాకినాడ ప్రాంతానికి చెందిన శ్రీముఖ ఐస్ ఫ్యాక్టరీ యజమాని పెమ్మాడి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు వల పన్ని పట్టుకున్నారు. పరిశ్రమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ కోసం బాధితుడు జిఎంను కలిశారు. ఇందుకుగాను మురళి రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడు చేసేదిలేక ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బుధవారం రాత్రి జిల్లా పరిశ్రమల కేంద్రంలో డబ్బులు తీసుకుంటుండగా జిఎంను రెడ్ హ్యాండ్‌గా అధికారులు పట్టుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

యానాం వార్తలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో యానాం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టకూరులోని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌పి రాజశేఖర్, సీఐ షణ్ముగం, మెట్టకూరు హైస్కూల్ హెచ్‌ఎం పి.రాజారామ్‌మోహన్‌రావు పాల్గొని ప్రారంభించారు. మొత్తం 10 జట్ల మధ్య 30 ఓవర్ల మ్యాచ్లను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యానాం క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ చిట్టి, కె.ప్రసాద్, పి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా పి.సుమన్ బాబు, వైజె.సత్యం, కె జయచంద్ర, సత్యనారాయణ,ప్రసాద్ లు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు లీగ్ పోటీలు, జూన్ 1న సెమీ ఫైనల్స్, జూన్ 2న ఫైనల్ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలికి శివ ప్రకాష్, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆధార్ అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి - యానాం

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి నగదు బదిలీ ద్వారా సొమ్మును పొందడానికి లబ్దిదారులు తమ ఆధార్ నెంబరును అనుసంధానం చేసుకోవాల్సి ఉందని ఆర్ఎఒ మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌పిజి గ్యాస్, బియ్యం తదితర వాటికి ప్రభుత్వం నగదు బదిలీ చేస్తుందని, అయితే కొన్ని కుటుంబాల పేర్లు డిపార్ట్మెంట్ వెబ్‌సైట్‌లో ఆధార్ అనుసంధానం చేయలేకపోవడం వల్ల పథకాల ప్రయోజనం పొందలేకపోతున్నారన్నారు. అందుకే అలాంటి వారు తమ ఆధార్ జిరాక్స్‌ను పౌరసరఫరాల శాఖకు సమర్పించాలని కోరారు.

ఆరోగ్య సేవలను యథావిధిగా కొనసాగించాలి : కలెక్టర్

ప్రయివేట్ ఆసుపత్రుల ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఉన్న ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ జె.నివాస్ కోరారు. గత సెప్టెంబరు నెల నుంచి తమకు బిల్లుల చెల్లింపు పెండింగ్ పడిననందున, ఆర్థిక భారం కారణంగా ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయాలని ప్రయివేట్ ఆసుపత్రులు నిర్ణయించిన నేపథ్యంలో కలెక్టర్ అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 3250 చికిత్సలను పేదలకు ఉచితంగా అందిస్తూ సాలినా రూ.3 వేల కోట్లు వెచ్చిస్తూ ప్రభుత్వం అందరికీ ఆరోగ్యం అందిస్తుందన్నారు. ఈ కృషిలో ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రయివేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు కీలక భూమిక వహిస్తున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన పేకేజి చెల్లింపులను ప్రభుత్వం నెట్ వర్క్ ఆసుపత్రులకు అందిస్తోందన్నారు. వివిధ కారణాల వల్ల ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు గత కొద్ది కాలంగా చెల్లింపులు జాప్యం జరుగుతున్న దృష్ట్యా, బిల్లుల సత్వర చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇప్పటికే ఇంటెర్మ్ చెల్లింపు జారీ చేసిందన్నారు. అనంతరం ఆరోగ్య శ్రీ పథకం అమలులో నెట్ వర్క్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సుమారు రూ.106 కోట్లు చెల్లింపులు చేయాల్సివుందని, ఇందులో రూ.75 కోట్లు మేరకు ప్రయివేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సి ఉందని ఆసుపత్రుల ప్రతినిధులు వివరించారు. 45 రోజులలోపు బిల్లులు చెల్లింపు అందనందున ఆర్థిక పరమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నామని, కన్సల్టెంట్ వైద్యులకు, సిబ్బందికి జీతాలు, మందులు సరఫరా చేసే వెండర్లకు బిల్లులు, బ్యాంకు రుణాలు చెల్లించలేకపోతున్నామని, ఈ కారణంగా తమ ఆసుపత్రుల సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. ఆర్థిక వత్తిడి వల్ల తమ ఉనికికే సవాలు ఎదురౌతోందని తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే వివిధ సేవలకు నిర్ణయించిన పేకేజీ మొత్తాలు సహేతుకంగా లేవని వాటిని రివైజ్ చేయాల్సి ఉందని, అందిస్తున్న సేవల నాణ్యత ఆధారంగా ఆసుపత్రుల గ్రేడింగ్ చేయాలని కోరారు. ప్రయివేట్ ఆసుపత్రుల సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి నివేదిస్తామని, ప్రజారోగ్య పరిరక్షణ ప్రాధాన్యత దృష్ట్యా ఎటువంటి అంతరాయం లేకుండా ఆరోగ్య శ్రీ పథకంలో సేవలను కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, డిఎంహెచ్ఓ డాక్టర్ జె.నరశింహనాయక్, ఐఎంఎ, ప్రయివేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం అని చాటిన గౌతమ బుద్ధుని జయంతోత్సవాలను జయప్రదం చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ పిలుపునిచ్చారు. ఆదుర్రు ఆది బౌద్ధ మహా స్తూప ప్రాంగణంలో ఈ నెల 26న జరిగే 2,569 బుద్ధ జయంతోత్సవాలకు జాతి, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని సుధీర్ కోరారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కాశి వెంకట రమణ, ట్రెజరర్ సఖిలే పథ్వీరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శరత్, కాశి సత్యనారాయణ, సింగపూర్ రమణ, సింహాద్రి వర్మా, కాశి జగపతిరావు, మోర్త వీర సూర్జం, జనిపల్లి చిన్న, బంగాళా రాజు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వైసిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

కార్యకర్తలతో ముచ్చటించిన సూర్యప్రకాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ బుధవారం కె.గంగవరం మండలంలోని సుందరపల్లి గ్రామంలో పర్యటించారు. ఉమా సోమేశ్వర స్వామి గుడికికి వెళ్లి దర్శనం చేసుకుని అనంతరం కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. కార్యకర్తలంతా ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని చెప్పడంతో వారందరితోను ఆయన సరదాగా గడిపారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లు ఆడపా నారాయణస్వామి, సాదా వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్యం సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి అన్నారు. బుధవారం గాంధీ నగర్ వివేకానంద పార్క్‌లోని గ్రంథాలయంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ కేటగిరిలలో 62 మంది విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవజాతుల్లో ఉత్కృష్టమైనది మానవ జన్మ అని, మిగిలిన జీవరాశులను పోషించ వలసిన, రక్షించాల్సిన బాధ్యత మానవునిదేనని అన్నారు. వారసత్వ సంపదలైన వృక్షాలు, జంతువులు, పవిత్రవనాలు, జలాశయాలు ఔషధ మొక్కల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రోటరి ఇంటరెక్ట్ క్లబ్ ఛైర్మన్ పివి.సుబ్బారావు మాట్లాడుతూ కనుమరుగవుతున్న జీవజాతుల రక్షణకు కృషి చేయాలన్నారు. ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం ఒక బృహత్తర కార్యక్రమమని అన్నారు. ఎలక్షన్‌లో నెగ్గిన ప్రజాప్రతినిధులు కనీసం లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని విజప్తి చేశారు. ఈ సందర్భంగా స్థాయి పర్యావరణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిపాలనాధికారి ములంపాక శ్రీనివాసరావు, శిక్షకులు పిల్లి గోవిందరాజులు, ఇంద్రజాలికులు విఎస్‌వి. రమణమార్తి, గణిత అవధాని పి.రవిశంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతి అందిస్తున్న ఆర్‌జెడి నాగమణి

కనుమరుగవుతున్న ఈత చెట్లు, పళ్లు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు పచ్చని పొలాల్లో గట్లపై ఎక్కడ చూసినా ఈత చెట్లు.. వేసవి వచ్చిందంటే ఈత చెట్లకు ఉండే ఈత పళ్ళతో కళకళలాడుతుండేవి. వేసవి వచ్చిందంటే చాలు ఈత పళ్ల కోసం పిల్లలు పెద్దలు కూడా పోటీ పడుతుండేవారు. ఈత చెట్ల కింద గ్రామాల్లో పిల్లలు ఈత పళ్ల ఏరుకోవడం పక్వానికి వచ్చిన తర్వాత ఈత గెలలను కొట్టుకుని కోసుకువెళ్లి మగ్గపెట్టి ఎంతో ప్రీతిపాత్రంగా ఈత పళ్ళను తినేవారు. రాను రాను మారుతున్న ఆధునిక యుగంలో వాటి జాడ కనుమరుగైపోతున్న పరిస్థితులు గ్రామాల్లో తలెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా పచ్చని పొలాలను చెరువులుగా మార్చేయడం చమురు సంస్థల కార్యకలాపాలు మరో పక్క రియల్ ఎస్టేట్ పేరుతో చెట్లు నరికేస్తుండడంతో కొన్ని జాతుల చెట్లతో పాటు ఈత చెట్లు కూడా కనుమరుగైపోతున్నాయి. అక్కడక్కడా ఉన్న ఈత చెట్లకు ఈత కల్లు తీసేందుకు ఉపయోగిస్తుండడంతో ఉన్న ఈత చెట్లు కూడా చనిపోయి అంతరించిపోతున్నాయి. ఇంకా ఎక్కడైనా ఈత చెట్లు ఉండి వాటికి వేసవిలో విరివిగా ఈత పళ్ళ గెలలు వేస్తే వాటిని మేకలు గొర్రెల ఆహారం కోసం గొర్రెల కాపరులు కొట్టుకుని తీసుకు వెళ్ళిపోతుండడంతో ఈత పళ్లు కాస్తా అందని ద్రాక్షగా మారాయి. ప్రస్తుతం చిత్రంలో కనిపిస్తున్న పళ్ళతో ఉన్న ఈత చెట్టు చల్లపల్లి పంచాయితీ జగ్గరాజుపేట ఆక్వా చెరువుల వద్ద కనిపించింది.

చల్లపల్లిలోని ఆక్వా చెరువు గట్టుపై ఈత చెట్టు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సిఐ ప్రశాంత్ కుమార్ కోరారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాల్లో గుంపులుగా ఉండకూడదన్నారు. రెచ్చగొట్టే విధంగా రాజకీయపరమైన ఫ్లెక్సీలు ఎక్కడా ఏర్పాటు చేయకూడదన్నారు. బైక్ ర్యాలీలు, బాణసంచాకు అనుమతులు లేవన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు అభ్యర్థి, కౌంటింగ్ ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఎస్ఐ కె.చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యంగా యువత సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడే విధంగా మెసేజ్‌లు పెట్టి ఇతర గ్రూపు సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, కోరుమామిడి గ్రామం, డి.నెం.6-107, కాపురస్తులు, **ఈదూరి మహేష్ బాబు, తండ్రి: కాంతారావు** అను నాయొక్క పాస్‌పోర్టు **నెం.R2779528** ది.20.04.2024న బండి మీద కోరుమామిడి నుంచి నిడదవోలు వచ్చే దారి మార్గంలో నా యొక్క పాస్ పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

ఈదూరి మహేష్‌బాబు, తండ్రి: కాంతారావు

ఫోన్: 9553057476

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S. No. 280 of 2023

Between:
Union Bank of India
[A Govt. of India undertaking]
[Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff
AND
Sri.D.V.Gupta
...Defendants

To
Sri.D.V.Gupta, S/o.Nagender Rao,
Aged about 47 years, Occ:Business,
R/o.D.No.86-4-10/1, V.L.Puram,
Tilak Road, Rajahmandry, A.P-533101.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of **Rs. 1,25, 165-93ps** towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 06-06-2024.

In case of your failure to attend before the Court on **06-06-2024** at **10-30** A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T. BHAGYA RAJU
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

ప్రజాశక్తి
www.prajasakti.com

సామర్లకోటలో సమస్యల తిష్ట

- తప్పని తాగునీటి కష్టాలు
- అధ్వానపు రహదారులు, డ్రెయిన్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రధాన సమస్యలను పాలకవర్గాలు, అధికారులు పట్టించుకోవడం లేదు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ స్థానికంగా టిడిపి నుంచి ఎంఎల్ఎగా నిమ్మకాయల చినరాజప్ప గెలిచారు. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులు పడకేశాయి. వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా దవులూరి దొరబాబును నియమించినప్పటికీ అభివృద్ధి పనులపై దృష్టి సారించలేదనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఇద్దరు మినహా 29 మంది వైసిపి కౌన్సిలర్ గెలుపొందినప్పటికీ ఫలితం లేకుండా పోయిందనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇక మున్సిపల్ అధికారులు తీరు 'గంతకు తగ్గ బొంత' అన్నట్లుగా ఉంది. ఆఖరికి తాగునీటి సమస్యను పరిష్కరించే పరిస్థితి అధికారులకు లేకుండాపోతుంది.

పట్టణం శిధిలమైన ప్రధాన రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టులతోపాటు, తాగునీటి సమస్య, అపారిశుధ్యంతో కొట్టుమిట్టాడుతోంది. పిఠాపురం - సామర్లకోట, పెద్దాపురం - సామర్లకోట ఆర్ అండ్ బి రహదారులు గుంతలమయమై ప్రయాణీకులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కందకం వద్ద ఏలేరు కొత్త వంతెన వద్ద అప్రోచ్ పాడై గుంతలు పడటంతో వాహన దారులు పడుతున్న

పెద్దాపురం రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అలాగే పిఠాపురం, పెద్దాపురం ప్రధాన రహదార్లలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు పడటంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాకినాడ, వేట్లపాలెం రోడ్డులోనూ ఆర్ అండ్ బి రహదారులు సైతం గోతులతో నిండుకుని ప్రయాణీకులకు శాపాలుగా మారుతున్నాయి. ఇక డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నెలకుంది. నీలమ్మ చెరువు, అయోధ్య రామపురం, తదితర ప్రాంతాల్లో కల్వర్టులు పూర్తిగా శిధిలమై ప్రమాదాలకు కేంద్రాలుగా మారిపోయాయి. అయోధ్య రామపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద కల్వర్ట్ పూర్తిగా శిధిలం కావడంతో డ్రెయిన్ ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో ప్రజల రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకుంది. పట్టణంలోని 90 శాతం డ్రెయిన్‌లలో పూడికను తొలగించకపోవడంతో ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే రోడ్డు, డ్రెయిన్ అన్నా తేడా లేకుండా మురుగునీటి ప్రవాహం జరుగుతోంది. ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తుండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సిఎం జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన జగనన్న కాలనీలో కనీస మౌలిక సదుపాయాలైన డ్రెయినేజీ వ్యవస్థను చేపట్టకపోవడంతో ఆయా గృహాల నుంచి వ్యర్థ నీటితోపాటు, వర్షపు నీరు బయటకు వెళ్లే దారి లేక రోడ్డు, నివాసాలు మురుగునీటితోనే కన్పిస్తున్నాయి. అలాగే పట్టణ ప్రజలను తాగునీటి సమస్య వెంటాడుతోంది. కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీటితోనూ తిప్పలు తప్పడం లేదు. ఫిల్టర్ ప్లాంట్‌లో లోపాల వల్ల, అవగాహన లేని సిబ్బందితో ఆకుపసరుగా, సుద్ద నీటిగా సరఫరా జరుగుతోంది. దీంతో తాగునీటి కోసం ప్రజలు ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించక తప్పని పరిస్థితి. మున్సిపాలిటీ అందించే మరో ముఖ్యమైన వ్యవస్థ పారిశుధ్య వ్యవస్థ. ఆ వ్యవస్థ సైతం పడకేసింది. ఇంటింటా చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ఆటోలు, ఇతర అత్యాధునిక వాహనాల మరమ్మతుల కారణంగా కార్యాలయ ఆవరణలో అలంకారప్రాయంగా ఉన్నాయి. కొద్దిపాటి వాహనాలు మాత్రమే వార్డుల్లో తిరగడంతో కొంతమేరకు మాత్రమే చెత్తను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో పిన్ పాయింట్ల వద్ద పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ఇలా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పట్టణాన్ని సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దే పాలకుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మూలన పడిన ఈ ఆటోలు

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

బాలుని మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని పారుపాక గ్రామానికి చెందిన పారుపల్లి రాజబాబు భార్య వెంకటలక్ష్మి జిల్లా ఎస్‌పి స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ అబ్దుల్ నబి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పారుపల్లి రాజబాబు వెంకటలక్ష్మి దంపతులకు ఆరేళ్ల బాలుడు పారుపల్లి సాకేత్ ఉన్నాడు. వీరు తుని పట్టణంలో నివాసం ఉంటున్నారు. మార్చి నెలలో బంధువుల వివాహం నిమిత్తం పారుపాక గ్రామానికి రాగా సాకేత్‌కు వరుసకు మేనమామ అయిన అదే గ్రామానికి చెందిన కె.శ్రీను మార్చి 13వ తేదీన పారుపాక గ్రామం నుంచి రౌతులపూడికి తీసుకురాగా రౌతులపూడి నుంచి పారుపాక తిరుగు ప్రయాణంలో రౌతులపూడి గ్రామ శివారు ద్విచక్ర వాహనంకు ప్రమాదం జరగడంతో సాకేత్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలు పాలైన సాకేత్‌ను వైద్యం నిమిత్తం తుని తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యశాల నిమిత్తం కాకినాడ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అదే నెల 16వ తేదీన సాకేత్ మృతి చెందాడు. ఆ సమయంలో ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంతో ఏప్రిల్ నెలలో జిల్లా ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రౌతులపూడి తహశీల్దార్ సిహెచ్.విద్యాపతి, ఎస్ఐ నబి సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

నాడు - నేడు పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు రెండో దశ పనుల్ల అలసత్వానికి తావు లేనివిధంగా శర వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనుల ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదేశాల మేరకు రెండో విడత చివరి దశలో ఉన్న నాడు-నేడు పనుల్లో అలసత్వానికి తావు లేకుండా త్వరితగతిన పాఠశాలలలు పున్నప్రారంభించే నాటికి పనులన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి పాఠశాలలోను తాగునీరు, విద్యుదీకరణ, తరగతి గదులు, మైనర్ మేజర్ పనులు వంటి మౌలిక వసతులను పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారంతో స్టేజ్ కంప్లీషన్ పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు కాంపోనెంట్‌ల వారీగా నాడు-నేడు పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించి పూర్తయిన పనుల బిల్లులను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీలు రావాల్సి ఉందని, పనులు పూర్తి చేయడానికి సిమెంటు, ఇసుక కొరత ఉందని ఎంఇఒలు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం ఎపిసి మధు సూదన్ రావు మండలాల వారీగా సమీక్ష నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమా వేశంలో సమగ్ర శిక్ష సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబ ఎపిఒ డాక్టర్ ఎంఎకె భీమారావు, ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్ కుమార్, ఇఇ సుబ్బరాజు పాల్గొన్నారు.

డాక్టర్ పెద్దింటికి సేవా రత్న పురస్కారం

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ పెద్దింటి రామం సేవా రత్న అవార్డుకు ఎంపికైనట్లు ఆ మేరకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై నుంచి లెటర్ పంపినట్లు రామం తెలిపారు. డాక్టర్ రామం ఇంతవరకు సుమారు 95 అవార్డులు పొందారు. సేవారత్న అవార్డును ఈ నెల 25వ తేదీన చెన్నైలోని భారతీయ విద్య కళా భవన్‌లో అందుకున్నట్లు తెలిపారు.

బాణాసంచా విక్రయాలు నిషిద్ధం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎన్నికల ప్రక్రియలో భాగంగా కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బాణాసంచా అమ్మకాలు, లూజు పెట్రోల్ అమ్మకాలు నిషేధించినట్లు ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో పార్టీలను, వ్యక్తులను ఆధారంగా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బొబ్బర్లంక పిచ్చుకలంక వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ గల్లంతై ఇటీవల పలువురు మృతి చెందిన నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలూ చోటు చేసుకోకుండా బుధవారం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్నానానికి వచ్చే వారిని ఇక్కడ జరిగే ప్రమాదాల గురించి వివరించి నచ్చజెప్పి పంపించేశారు. నలుగురు పోలీసు సిబ్బందితో ప్రతిరోజు ఇక్కడ గోదావరి నదిలో ఎవరూ స్నానానికి దిగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఎసిబికి చిక్కిన పరిశ్రమల శాఖ జిఎం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ పరిశ్రమల శాఖ కాకినాడ జిల్లా జనరల్ మేనేజర్ టి.మురళి బుధవారం రాత్రి ఎసిబి వలలో చిక్కారు. కాకినాడ ప్రాంతానికి చెందిన శ్రీముఖ ఐస్ ఫ్యాక్టరీ యజమాని పెమ్మాడి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు వల పన్ని పట్టుకున్నారు. పరిశ్రమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ కోసం బాధితుడు జిఎంను కలిశారు. ఇందుకుగాను మురళి రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడు చేసేదిలేక ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బుధవారం రాత్రి జిల్లా పరిశ్రమల కేంద్రంలో డబ్బులు తీసుకుంటుండగా జిఎంను రెడ్ హ్యాండ్‌గా అధికారులు పట్టుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

యానాం వార్తలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో యానాం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టకూరులోని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌పి రాజశేఖర్, సీఐ షణ్ముగం, మెట్టకూరు హైస్కూల్ హెచ్‌ఎం పి.రాజారామ్‌మోహన్‌రావు పాల్గొని ప్రారంభించారు. మొత్తం 10 జట్ల మధ్య 30 ఓవర్ల మ్యాచ్లను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యానాం క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రెటరీ చిట్టి, కె.ప్రసాద్, పి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా పి.సుమన్ బాబు, వైజె.సత్యం, కె జయచంద్ర, సత్యనారాయణ, ప్రసాద్ లు వ్యవహరిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు లీగ్ పోటీలు, జూన్ 1న సెమీ ఫైనల్స్, జూన్ 2న ఫైనల్ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలికి శివ ప్రకాష్, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆధార్ అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి - యానాం

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి నగదు బదిలీ ద్వారా సొమ్మును పొందడానికి లబ్దిదారులు తమ ఆధార్ నెంబరును అనుసంధానం చేసుకోవాల్సి ఉందని ఆర్ఎఒ మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌పిజి గ్యాస్, బియ్యం తదితర వాటికి ప్రభుత్వం నగదు బదిలీ చేస్తుందని, అయితే కొన్ని కుటుంబాల పేర్లు డిపార్ట్మెంట్ వెబ్‌సైట్‌లో ఆధార్ అనుసంధానం చేయలేకపోవడం వల్ల పథకాల ప్రయోజనం పొందలేకపోతున్నారన్నారు. అందుకే అలాంటి వారు తమ ఆధార్ జిరాక్స్‌ను పౌరసరఫరాల శాఖకు సమర్పించాలని కోరారు.

ఆరోగ్య సేవలను యథావిధిగా కొనసాగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఉన్న ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ జె.నివాస్ కోరారు. గత సెప్టెంబరు నెల నుంచి తమకు బిల్లుల చెల్లింపు పెండింగ్ పడిననందున, ఆర్థిక భారం కారణంగా ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయాలని ప్రయివేట్ ఆసుపత్రులు నిర్ణయించిన నేపథ్యంలో కలెక్టర్ అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 3250 చికిత్సలను పేదలకు ఉచితంగా అందిస్తూ సాలినా రూ.3 వేల కోట్లు వెచ్చిస్తూ ప్రభుత్వం అందరికీ ఆరోగ్యం అందిస్తుందన్నారు. ఈ కృషిలో ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రయివేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు కీలక భూమిక వహిస్తున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన పేకేజి చెల్లింపులను ప్రభుత్వం నెట్ వర్క్ ఆసుపత్రులకు అందిస్తోందన్నారు. వివిధ కారణాల వల్ల ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు గత కొద్ది కాలంగా చెల్లింపులు జాప్యం జరుగుతున్న దృష్ట్యా, బిల్లుల సత్వర చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇప్పటికే ఇంటెర్మ్ చెల్లింపు జారీ చేసిందన్నారు. అనంతరం ఆరోగ్య శ్రీ పథకం అమలులో నెట్ వర్క్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సుమారు రూ.106 కోట్లు చెల్లింపులు చేయాల్సివుందని, ఇందులో రూ.75 కోట్లు మేరకు ప్రయివేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సి ఉందని ఆసుపత్రుల ప్రతినిధులు వివరించారు. 45 రోజులలోపు బిల్లులు చెల్లింపు అందనందున ఆర్థిక పరమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నామని, కన్సల్టెంట్ వైద్యులకు, సిబ్బందికి జీతాలు, మందులు సరఫరా చేసే వెండర్లకు బిల్లులు, బ్యాంకు రుణాలు చెల్లించ లేకపోతున్నామని, ఈ కారణంగా తమ ఆసుపత్రుల సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. ఆర్థిక వత్తిడి వల్ల తమ ఉనికికే సవాలు ఎదురౌతోందని తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే వివిధ సేవలకు నిర్ణయించిన పేకేజీ మొత్తాలు సహేతుకంగా లేవని వాటిని రివైజ్ చేయాల్సి ఉందని, అందిస్తున్న సేవల నాణ్యత ఆధారంగా ఆసుపత్రుల గ్రేడింగ్ చేయాలని కోరారు. ప్రయివేట్ ఆసుపత్రుల సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి నివేదిస్తామని, ప్రజారోగ్య పరిరక్షణ ప్రాధాన్యత దృష్ట్యా ఎటువంటి అంతరాయం లేకుండా ఆరోగ్య శ్రీ పథకంలో సేవలను కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరశింహనాయక్, ఐఎంఎ, ప్రయివేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆసుపత్రుల ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

బుద్ధ జయంతోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం అని చాటిన గౌతమ బుద్ధుని జయంతోత్సవాలను జయప్రదం చేయాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ పిలుపునిచ్చారు. ఆదుర్రు ఆది బౌద్ధ మహా స్తూప ప్రాంగణంలో ఈ నెల 26న జరిగే 2,569 బుద్ధ జయంతోత్సవాలకు జాతి, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని సుధీర్ కోరారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కాశి వెంకట రమణ, ట్రెజరర్ సఖిలే పథ్వీరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శరత్, కాశి సత్యనారాయణ, సింగపూర్ రమణ, సింహాద్రి వర్మ, కాశి జగపతిరావు, మోర్త వీర సూర్జం, జనిపల్లి చిన్న, బంగాళా రాజు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వైసిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

కార్యకర్తలతో ముచ్చటించిన సూర్యప్రకాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ బుధవారం కె.గంగవరం మండలంలోని సుందరపల్లి గ్రామంలో పర్యటించారు. ఉమా సోమేశ్వర స్వామి గుడికికి వెళ్లి దర్శనం చేసుకుని అనంతరం కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. కార్యకర్తలంతా ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని చెప్పడంతో వారందరితోను ఆయన సరదాగా గడిపారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లు ఆడపా నారాయణస్వామి, సాదా వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్యం సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి అన్నారు. బుధవారం గాంధీ నగర్ వివేకానంద పార్క్‌లోని గ్రంథాలయంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ కేటగిరిలలో 62 మంది విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవజాతుల్లో ఉత్కృష్టమైనది మానవ జన్మ అని, మిగిలిన జీవరాశులను పోషించ వలసిన, రక్షించాల్సిన బాధ్యత మానవునిదేనని అన్నారు. వారసత్వ సంపదలైన వృక్షాలు, జంతువులు, పవిత్రవనాలు, జలాశయాలు ఔషధ మొక్కల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రోటరి ఇంటరెక్ట్ క్లబ్ ఛైర్మన్ పివి.సుబ్బారావు మాట్లాడుతూ కనుమరుగవుతున్న జీవజాతుల రక్షణకు కృషి చేయాలన్నారు. ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం ఒక బృహత్తర కార్యక్రమమని అన్నారు. ఎలక్షన్‌లో నెగ్గిన ప్రజాప్రతినిధులు కనీసం లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని విజప్తి చేశారు. ఈ సందర్భంగా స్థాయి పర్యావరణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిపాలనాధికారి ములంపాక శ్రీనివాసరావు, శిక్షకులు పిల్లి గోవిందరాజులు, ఇంద్రజాలికులు విఎస్‌వి. రమణమూర్తి, గణిత అవధాని పి.రవిశంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతి అందిస్తున్న ఆర్‌జెడి నాగమణి

కనుమరుగవుతున్న ఈత చెట్లు, పళ్లు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు పచ్చని పొలాల్లో గట్లపై ఎక్కడ చూసినా ఈత చెట్లు.. వేసవి వచ్చిందంటే ఈత చెట్లకు ఉండే ఈత పళ్ళతో కళకళలాడుతుండేవి. వేసవి వచ్చిందంటే చాలు ఈత పళ్ళ కోసం పిల్లలు పెద్దలు కూడా పోటీ పడుతుండేవారు. ఈత చెట్ల కింద గ్రామాల్లో పిల్లలు ఈత పళ్ళ ఏరుకోవడం పక్కానికి వచ్చిన తర్వాత ఈత గెలలను కొట్టుకుని కోసుకువెళ్లి మగ్గపెట్టి ఎంతో ప్రీతిపాత్రంగా ఈత పళ్ళను తినేవారు. రాను రాను మారుతున్న ఆధునిక యుగంలో వాటి జాడ కనుమరుగైపోతున్న పరిస్థితులు గ్రామాల్లో తలెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా పచ్చని పొలాలను చెరువులుగా మార్చేయడం చమురు సంస్థల కార్యకలాపాలు మరో పక్క రియల్ ఎస్టేట్ పేరుతో చెట్లు నరికేస్తుండడంతో కొన్ని జాతుల చెట్లతో పాటు ఈత చెట్లు కూడా కనుమరుగైపోతున్నాయి. అక్కడక్కడా ఉన్న ఈత చెట్లకు ఈత కల్లు తీసేందుకు ఉపయోగిస్తుండడంతో ఉన్న ఈత చెట్లు కూడా చనిపోయి అంతరించిపోతున్నాయి. ఇంకా ఎక్కడైనా ఈత చెట్లు ఉండి వాటికి వేసవిలో విరివిగా ఈత పళ్ళ గెలలు వేస్తే వాటిని మేకలు గొర్రెల ఆహారం కోసం గొర్రెల కాపరులు కొట్టుకుని తీసుకు వెళ్ళిపోతుండడంతో ఈత పళ్లు కాస్తా అందని ద్రాక్షగా మారాయి. ప్రస్తుతం చిత్రంలో కనిపిస్తున్న పళ్ళతో ఉన్న ఈత చెట్టు చల్లపల్లి పంచాయితీ జగ్గరాజుపేట ఆక్వా చెరువుల వద్ద కనిపించింది.

చల్లపల్లిలోని ఆక్వా చెరువు గట్టుపై ఈత చెట్టు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సిఐ ప్రశాంత్ కుమార్ కోరారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాల్లో గుంపులుగా ఉండకూడదన్నారు. రెచ్చగొట్టే విధంగా రాజకీయపరమైన ఫ్లెక్సీలు ఎక్కడా ఏర్పాటు చేయకూడదన్నారు. బైక్ ర్యాలీలు, బాణసంచాకు అనుమతులు లేవన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు అభ్యర్థి, కౌంటింగ్ ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఎస్ఐ కె.చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యంగా యువత సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడే విధంగా మెసేజ్‌లు పెట్టి ఇతర గ్రూపు సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, కోరుమామిడి గ్రామం, డి.నెం.6-107, కాపురస్తులు, **ఈదూరి మహేష్ బాబు, తండ్రి: కాంతారావు** అను నాయొక్క పాస్‌పోర్టు **నెం.R2779528** ది.20.04.2024న బండి మీద కోరుమామిడి నుంచి నిడదవోలు వచ్చే దారి మార్గంలో నా యొక్క పాస్ పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

ఈదూరి మహేష్‌బాబు, తండ్రి: కాంతారావు

ఫోన్: 9553057476

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S. No. 280 of 2023

Between:
Union Bank of India
[A Govt. of India undertaking]
[Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff

AND

Sri.D.V.Gupta
...Defendants

To
Sri.D.V.Gupta, S/o.Nagender Rao,
Aged about 47 years, Occ:Business,
R/o.D.No.86-4-10/1, V.L.Puram,
Tilak Road, Rajahmandry, A.P-533101.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of **Rs. 1,25, 165-93ps** towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 06-06-2024.

In case of your failure to attend before the Court on **06-06-2024** at **10-30** A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)

T. BHAGYA RAJU
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.